
అడ్డగుట్టలోని జేఎన్ఎన్‌ఆర్‌యూఎం గృహసముదాయం

'శిథిలం' భయం.. భయం

పెచ్చులూడుతున్న గోడలు | కూలిపోయిన రెయిలింగ్‌లు

- ప్రమాదకరంగా ఇనుపచువ్వలు
- లష్కర్‌లో వాంబే, జేఎన్ఎన్‌ఆర్‌యూఎం గృహాలు
- భయాందోళనల్లో పేద కుటుంబాలు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన బలహీనవర్గాల గృహాలు క్రమేణా శిథిలావస్థకు చేరుతున్నాయి. వాంబే, జేఎన్ఎన్‌ఆర్‌యూఎం, ఈడబ్ల్యూఎస్ పథకాల ద్వారా 1985–2000 ప్రాంతంలో నిర్మించిన గృహాలను అప్పటి ప్రభుత్వం ఈ ప్రాంతాల్లోని పేదలకు అందజేసింది. అప్పటి నుంచీ గృహసముదాయాలకు ఎటువంటి మరమ్మతులు చేపట్టని కారణంతో ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి.

- వర్షాకాలం వచ్చిన ప్రతిసారీ ఈ గృహాల్లో నివసిస్తున్న కుటుంబాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. శిథిలావస్థకు చేరుతున్న గృహసముదాయాలను మరమ్మతు చేయాలని అందులోని కుటుంబాలకు చెందిన వ్యక్తులు అధికారుల చేట్టే తిరుగుతున్నా స్పందన కానరావడం లేదన్న విమర్శలున్నాయి.

చంద్రబాబునగర్ మరీ ప్రమాదం

శిథిలావస్థకు చేరిన సుమారు 700 గృహాల్లో తార్నాక డివిజన్ లాలాపేట చంద్రబాబునగర్ గృహనిర్మాణ సముదాయం మరీ ప్రమాదకరంగా పరిణమించినట్టు హౌజింగ్ అధికారులు ప్రకటించారు. అన్ని ప్రాంతాల్లోని గృహసముదాయాలను మరమ్మతు చేసే అవకాశం ఉందని, చంద్రబాబునగర్ గృహసముదాయ పరిస్థితి మాత్రం చేయిదాటిపోయిందని అధికారులు చెబుతున్నారు.

- ఇక్కడి 140 గృహాలు కలిగిన సముదాయాన్ని మొత్తంగా నేలమట్టం చేయాలని జీహెచ్ఎంసీ హౌజింగ్ విభాగం అధికారులు అధ్యయనం చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఇందులోని కుటుంబాలు ఖాళీ చేసి రక్షిత ప్రాంతాలకు వెళ్లడం మంచిదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

700 గృహాలు ప్రమాదకరం....

నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇరవై ఏళ్లలో వాంబే, జేఎస్ఎన్‌ఆర్‌యూఎం పథకాల ద్వారా గృహాలు నిర్మించారు. అయితే ఇందులో 20–30 సంవత్సరాలు పూర్తయిన గృహసముదాయాలు మాత్రం క్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి. పెచ్చులూడడంతో ప్రారంభమైన గృహసముదాయాలు ప్రస్తుతం గోడలు, పైకప్పులు సైతం పటిష్టతను కోల్పోయాయి.

- పలు గృహసముదాయాలకు పిట్టగోడలు కూడిపోయి పైకప్పు, మెట్లదారులు ప్రమాదకరంగా పరిణమించాయి. మెట్టుగూడ, తార్నాక, అడ్డగుట్ట డివిజన్లకు చెందిన పాండవబస్తీ, చంద్రబాబునగర్, చిలకలగూడ వైట్‌హౌజ్ ఏరియా, మాంగారోడియాబస్తీ, శాస్త్రీనగర్ ప్రాంతాల్లోని సుమారు 700 గృహాలు శిథిలావస్థకు చేరినట్టు జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొంటున్నారు.

భయం గుప్పిట్లో కుటుంబాలు

పలు భవన సముదాయాల్లో పిట్టగోడలు మొత్తంగా కూలిపోయాయి. పై అంతస్తుల గోడలు శిథిలమై పెచ్చులూడుతున్నాయి. పిల్లర్ల పటుత్వం బలహీనపడుతున్నాయి. పిల్లర్లు, రెయిలింగ్, మెట్ల నుంచి ఇనుపచువ్వలు బయటికి వచ్చి ప్రమాదకరంగా పరిణమించాయి.

- ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన గృహసముదాయాల్లో నివసిస్తున్న కుటుంబాలకు చెందిన వ్యక్తులు మాత్రం వర్షాలు కురిసిన సందర్భాల్లో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇండ్లు ఖాళీచేసి వెళ్లాలని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరిస్తున్నారని లేనిపక్షంలో తమను డబ్బు వెచ్చించుకుని మరమ్మతులు చేయించుకోవాలని సూచిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మరాఠాబస్తీలోని ఈడబ్ల్యూఎస్ గృహసముదాయం

మరమ్మతు కోసం అధికారులను ఆదేశించాం



శిథిలావస్థకు చేరిన గృహనిర్మాణ సముదాయాలను మరమ్మతు చేయించాలని ఇటీవలి సమీక్ష సమావేశంలో అధికారులను ఆదేశించాం. అధికారుల నుంచి స్పందన రాకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతుల కోసం ఒత్తిడి తీసుకువస్తాం. లాలాపేటలోని చంద్రబాబునగర్ గృహాలు మాత్రం మరమ్మతు చేయడానికి వీలు లేదని అధికారుల బృందం తేల్చింది. వారిని ఖాళీ చేయించి అక్కడే మళ్లీ నిర్మాణాలు చేపట్టాలా లేక ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలా అన్న విషయంలో అధ్యయనం చేస్తున్నాం.

– ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్

మోదీ పథకాలను ప్రజలకు వివరించాలి


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమాభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్టేట్ కౌన్సిల్ మెంబర్ పోచయ్య యాదవ్ కార్యకర్తలకు సూచించారు. శనివారం డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య నేతృత్వంలో అడ్డగుట్టలో బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచయ్య, డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్యలు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పాలన 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ చేసిన అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్నటువంటి సంక్షేమ పథకాలు అదే విధంగా ప్రపంచ దేశాలతో పోటీపడి మన భారత దేశాన్ని మొదటి స్థానంలో నిలపడానికి ప్రధాని చేస్తున్న కృషిని ప్రజలకు వివరించే విధంగా డివిజన్లో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డివిజన్ కమిటీ సభ్యులు శ్రీధర్, చిరంజీవి, వసంత, దుర్గ, గంభీరావుపేట సాయన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సనత్‌నగర్: ప్రమాదవశాత్తూ బైక్‌పై నుంచి కిందపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు..ఎంఎస్ మక్తాకు చెందిన సూర్యరాజ్ (39) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 4వ తేదీన అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై సికింద్రాబాద్ వైపు నుంచి బేగంపేట వైపు వస్తూ మహర్షి కళాశాల సమీపంలో వాహనం అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో బాధితుడిని 108 అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సూర్యరాజ్ మృతి చెందాడు. ఈ మేరకు సూర్యరాజ్ బంధువైన సుధాకర్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..)టమాటా.17, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 57, పచ్చకాకర 42, పందిరి బీర 40, క్యాబేజీ 13, క్యారెట్ 35, దొండ 23, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 75, గోకరకాయ 37, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 24, చామగడ్డ 33, మొరంగడ్డ 15, కందగడ్డ 45, సొరకాయ 9, పొట్లకాయ 23, అరటికాయ 10, మునగకాయ 3–4.

అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న వ్యక్తిపై కేసు

సనత్‌నగర్: అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న వ్యక్తిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎల్బీనగర్ సూర్యోదయకాలనీ రోడ్ నెంబర్–2లో నివాసం ఉండే వినోద్‌కుమార్ (31) న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న మధ్యాహ్నం 2 గంటలకు తన స్నేహితుడితో కలిసి వినోద్‌కుమార్ బబ్బుగూడ పశువుల మార్కెట్‌లో పశు వైద్యాధికారిని కలిసేందుకు అక్కడి కార్యాలయానికి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ పశు వైద్యాధికారి లేకపోవడంతో తిరిగి వచ్చే క్రమంలో వారు మార్కెట్ ప్రధాన ద్వారం వద్దకు రాగానే టాటా ఏస్ అశోక్ లేల్యాండ్ వాహనంలో మూడు చిన్న ఎద్దులను తీసుకువెళ్తున్నట్లు గమనించాడు. వాటిని పూర్తిగా మూసివేసి నల్లటి కవర్‌తో కప్పి ఆహారం, నీరు, గాలి లేకుండా వాటిని తరలిస్తున్నారని, బక్రీద్ పేరుతో అక్రమంగా వధిస్తున్నారని తెలుసుకున్నాడు. ఈ మేరకు వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించే చట్టం–1960 కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి


నంద కిశోర్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ ప్రాంతానికి ప్రైవేటు ఉద్యోగి నంద కిశోర్(37) గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఛాతి నొప్పి రావడంతో గాంధీ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ ఈసీజీ తీసి డాక్టర్‌కు చూపించే ప్రయత్నంలో క్యూలో ఉన్న నందకిశోర్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గుండె నొప్పి తీవ్రం కావడంతో ఆయన మరణించాడు. ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నంద కిశోర్ మరణం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలపై ఉదాసీనత తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రవేటు ఇంజినీరింగ్ అక్రమాల పై రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారులు ఉదాసీనతగా వ్యవహరించడం తగదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయాలకు ఇంజినీరింగ్ సీట్లను అమ్ముకుంటున్న ప్రైవేటు కాలేజీల గుర్తింపును రద్దు చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించారు. నారాయణ, ఎం.పి సునీల్, అనిత, శ్రావణ్, రాజశేఖర్, డి. శ్రీనివాస్, రమేష్, డాక్టర్ శివకుమార్ లాల్, బాలక్రిష్ణ, రమేష్, జగదీష్ తదితరులు ఉన్నారు.

విద్యాభవనాల నిర్మాణానికి కృషి


ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను కలిసిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బంగ్ల భారతి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అధునాతన విద్యాసంస్థల భవన నిర్మాణాల కోసం కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ చెప్పారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ జి.బంగ్ల భారతి శనివారం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపకులు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతాఫల్‌మండి గవర్నమెంట్ స్కూల్ ప్రాంగణంలో జూనియర్, డిగ్రీ కాలేజీలు గత ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు చేయించామన్నారు. ఇక్కడ కొత్త భవనాల నిర్మాణానికి రూ.29.75 కోట్ల మేరకు నిధులను అప్పుడే మంజూరు చేయించామని తెలిపారు. ఇటీవలే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలో భవననిర్మాణం పనులు ప్రారంభించడం కోసం ప్రయత్నాలు చేస్తున్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రయాణికురాలికి బంగారం, నగదు అప్పగింత


ప్రయాణికురాలి ఆభరణాలు అందిస్తున్న ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సారస్వత్

సికింద్రాబాద్: రైలు ప్రయాణం ద్వారా నగరానికి చేరుకున్న ఒక మహిళా ప్రయాణికురాలు స్టేషన్‌లో మరిచిపోయిన బ్యాగును అందులోని నగదు, ఆభరణాలను ఆర్పీఎఫ్ పోలీసులు శనివారం ఆమెకు అప్పగించారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీఎస్ సారస్వత్ తెలిపిన మేరకు... ఈనెల 6న నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో జకియాబేగం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. స్టేషన్ నుంచి బయటకు బయటకు వెళ్లే హడావుడిలో తన లగేజీ బ్యాగులను స్టేషన్‌లోనే మరిచి పోయింది. స్టేషన్ విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ బృందం సదరు లగేజీ బ్యాగులను భద్రపరిచారు. అందులో లభించిన గుర్తింపు కార్డుల ఆధారంగా ప్రయాణికురాలికి సమాచారం అందించారు. ఆర్‌పీఎఫ్ స్టేషన్‌కు ప్రయాణికురాలిని రప్పించిన పోలీసులు బ్యాగులతోపాటు అందులోని రూ.7 లక్షల విలువ చేసే నక్లెస్, ఉంగరాలు, గొలుసు తదితర బంగారు ఆభరణాలు, రూ.29 వేల నగదును అందించారు.

యువకుడిని రక్షించిన ఆర్‌పీఎఫ్

సికింద్రాబాద్–లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్య ఆత్మహత్యకు యత్నించిన ఒక యువకుడిని ఆర్‌పీఎఫ్ పోలీసులు శనివారం రక్షించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో రైల్వే ట్రాక్ పక్కనే తచ్చాడుతున్న ఒక యువకుడిని విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ పోలీసులు గుర్తించారు. రైలు వస్తున్న సమయంలో ట్రాక్ మీదకు వెళ్లేందుకు ప్రయత్నించిన అతనిని పోలీసులు పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో శనివారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని భారీ ఎత్తున సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. చిలకలగూడ ఈద్గా మైదానంలో బక్రీద్ వేడుకలు ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



సరుకుల పంపిణీలో అవాంతరాలు రానివ్వం

సనత్‌నగర్: మూడు నెలల నిత్యావసర సరుకులను ఒకేసారి పంపిణీ చేస్తున్న దృష్ట్యా లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతంగా రేషన్ పంపిణీని కొనసాగిస్తున్నట్లు ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్ ఏఎస్ఓ జ్యోతి తెలిపారు. మూడు నెలల నిత్యావసర సరుకులను ఒకేసారి పంపిణీ చేస్తున్న తీరుపై శనివారం ఆమె సనత్‌నగర్‌లోని పలు రేషన్ దుకాణాలను సందర్శించి పరిశీలించారు. ఆహార భద్రతా కార్డు లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారికి అందాల్సిన నిత్యావసర సరుకులు సక్రమంగా అందుతున్నాయో లేదో స్వయంగా ఆరా తీశారు. కార్యక్రమంలో ఆమెతో పాటు సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు కూడా ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి సురేశ్ థియేటర్ సమీపంలోని శ్రీగిరి జ్యోతిష్యాలయంలో ఈనెల 8, 9తేదీల్లో చేపమందు ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్టు నిర్వాహకుడు శంకర్‌ముఖియా తెలిపారు. చేపమందు పంపిణీ పోస్టర్‌ను రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన విష్కరించారు. ఈ సందర్భంగా శంకర్‌ముఖియా మాట్లాడుతూ 8న ఉదయం రాజ్యసభ సభ్యుడు అనిక్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ సామల హేమ, శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయ ఛైర్మన్ నోముల ప్రకాశ్‌రావులు ముఖ్యఅతిథులుగా హాజరై చేపమందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. 45 సంవత్సరాలుగా చేపమందు ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

అర్ధరాత్రి సంగీత హోరు.. కేసు నమోదు

సనత్‌నగర్: అర్ధరాత్రి భారీ శబ్దాలతో ప్యాడ్‌బ్యాండ్ వాయిస్తున్న నిర్వాహకుడితో పాటు ఈవెంట్ ఆర్గనైజర్‌పై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లో కొంతమంది వ్యక్తులు ఈ నెల 5న అర్ధరాత్రి భారీ శబ్దాలతో ప్యాడ్ బ్యాండ్ వాయిస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారని స్థానికులు డయల్ 100కు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్యాడ్ బ్యాండ్ వాయిస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నట్లు గుర్తించారు. అనుమతి పత్రాన్ని చూపించమని అడగ్గా తాము ఎటువంటి అనుమతి తీసుకోలేదని తెలిపారు. దీంతో ప్యాడ్ యజమాని దస్తగిరితో పాటు నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు దాటుతున్న మామా అల్లుళ్లను ఢీకొట్టిన కారు

సనత్‌నగర్: రోడ్డు దాటుతున్న మామా అల్లుళ్లను కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌కు చెందిన షేక్ ఇనాయత్, అతనికి వరుసకు అల్లుడు అయిన షేక్ ఎలియాస్‌లు ఈ నెల 5న ఎర్రగడ్డ జెకే పాయింట్ హోటల్ నుంచి సనతనగర్ రోడ్డు వైపు వెళ్లేందుకు ఎర్రగడ్డ క్రాస్‌రోడ్డు వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నారు. ఎస్సార్‌నగర్ నుంచి భరత్‌నగర్ వైపు అతివేగంగా వచ్చిన మారుతి టూర్–హెచ్3 కారు డ్రైవర్ వారిని బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో వీరు గాయాలకు గురికావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. వీరిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వీరిని ఢీకొన్న డ్రైవర్ అభిలాష్‌గా గుర్తించారు. అతని చర్యలు తీసుకోవాల్సిందిగా షేక్ ఇనాయత్ కుమార్తె రుక్యాబేగం శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో 'నామినేటెడ్ మెంబర్' మార్పు!

- బీజేపీలో ముదురుతున్న అంతర్గత విభేదాలు...
- నామినేటెడ్ మెంబర్ కోసం సీనియర్ నేతల పట్టు
- ఎంపీ ఈటెలకు డజనుకు పైగా నేతల వినతులు
- ఈ సారి 'పాత వారికే' అవకాశమివ్వాలంటూ డిమాండ్

కంటోన్మెంట్: త్వరలో కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ (సీఎస్ఎం) మార్పు జరగనున్నట్లు తెలుస్తోంది. కంటోన్మెంట్‌లో కీలకమైన సీఎస్ఎం పదవి బీజేపీ నేతలకే దక్కనున్నట్లు దాదాపు మూడేళ్ల పాటు బీజేపీకి చెందిన రామకృష్ణ బోర్డు సభ్యుడిగా కొనసాగారు. మూడు నెలల క్రితం ఆయనను తప్పించి భానుక నర్మదకు అవకాశం కల్పించారు. ఈ ఇద్దరు నేతలూ కొన్నేళ్ల క్రితమే బీజేపీలో చేరారు. దాదాపు మూడు దశాబ్దాలుగా పార్టీలో కొనసాగుతున్న సీనియర్లను కాదని, కొత్తగా వచ్చిన వారికే కీలకమైన పదవులు కట్టబెట్టడంపై సీనియర్లు గుర్రుమంటున్నారు. ఈ నేపథ్యంలో ఆరు నెలలకోసారి కొత్త వారికి అవకాశం కల్పించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాల్సిందిగా వినతి పత్రాలు అందజేశారు. ఇదే విషయమై పార్టీ సీనియర్ నేత, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ కో కన్వీనర్ జేవీ నర్సింగ్ రావు కుండబద్దలు కొట్టడం ఆ పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆయనేమన్నారంటే..

పార్టీ సీనియర్ నేత జేవీ నర్సింగ్ రావు శుక్రవారం ఐదోవార్డులో జరిగిన ఓ కార్యక్రమంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీలోని సీనియర్లు అయిన టోపీ శంకర్, ధనుంజయ చారి, ఆకుల నాగేశ్, మాచర్ల శ్రీనివాస్, ప్రస్తుత నియోజకవర్గ కన్వీనర్ విజయానంద్, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పనిచేసిన రాయల కుమార్, దయానంద్ వంటి నేతలతో పాటు ఇటీవల వార్డు అధ్యక్షులుగా పదవీ కాలం పూర్తి చేసుకున్న యువ నాయకులు సైతం నామినేటెడ్ మెంబర్ పదవిని ఆశిస్తున్నట్లు తెలిపారు. టోపీ శంకర్, ధనుంజయ చారి వంటి నేతలు 40 ఏళ్లుగా పార్టీలో కొనసాగుతున్నట్లు తెలిపారు. తాను కూడా సీనియర్‌నే అయినప్పటికీ, నామినేటెడ్ మెంబర్ రేసులో లేనని తేల్చి చెప్పారు. ఆగస్టులో నామినేటెడ్ మెంబర్ పదవి మార్పు జరిగే అవకాశముందని స్వయంగా ఎంపీ ఈటల చెప్పినట్లుగా ప్రచారం సాగుతోందన్నారు. జేవీ నర్సింగ్ రావు వ్యాఖ్యలతో ఈ పదవిని ఆశిస్తున్న మాజీ జిల్లా అధికార ప్రతినిధి బీఎన్ శ్రీనివాస్ వంటి వారికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. ఆయన సైతం ఇటీవల కాలంలోనే బీజేపీలో చేరడమే ఇందుకు కారణం. మొత్తానికి బీజేపీలో ఆధిపత్య పోరు ఎక్కువవడంతోనే బోర్డు మెంబర్ మార్పు అంశం కీలకంగా మారిందని పలువురు పార్టీ నేతలు పేర్కొంటున్నారు.